మంత్రివర్యా.. మడిగెలు తెరవలే..

అందుబాటులోకి రాని సమీకృత మార్కెట్ భవనం

సముదాయంలో మూసి ఉన్న దుకాణాలు

న్యూస్‌టుడే, జహీరాబాద్: ఈ ఏడాది ఫిబ్రవరి 23న జహీరాబాద్ వచ్చిన మంత్రి దామోదర్ రాజనర్సింహ పట్టణంలో రూ.11 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ సముదాయం సమస్యపై సమీక్షించారు. 'వారం రోజుల్లో బకాయి బిల్లులు ఇప్పిస్తా.. వెంటనే తాళాలు అప్పగించాలి' అంటూ గుత్తేదారుకు సూచించారు. తాళాలు తీసుకొని వారం రోజుల్లో దుకాణాలు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని పాలనాధికారిని ఆదేశించారు. దాదాపు ఏణ్నెల్లవుతున్నా ఇంతవరకు వినియోగంలోకి రాలేదు. దీంతో భవనం నిరుపయోగంగా మారడంతోపాటు పురపాలక సంఘానికి ఆదాయం రావడం లేదు.

ఏడాదిన్నరగా ఎదురు చూపులు..

పురపాలికకు ఆదాయాన్ని సమకూర్చడంతోపాటు పట్టణంలోని వ్యాపారులకు దుకాణాల కొరత తీర్చాలనే ఉద్దేశంతో జహీరాబాద్ పట్టణంలో రూ.11 కోట్లతో నిర్మించిన సమీకృత సముదాయ భవనాన్ని డిసెంబర్ 2022లో అప్పటి మంత్రి టి.హరీశ్‌రావు ప్రారంభించారు. పట్టణంలోని రహదారుల వెంట, మురుగు కాలువలపై, కూడళ్ల వద్దనున్న కూరగాయలు, మాంసం, చేపల దుకాణాలతో పాటు ప్రధాన వ్యాపార సంస్థలన్నీ ఒకే దగ్గర నిర్వహించేలా గ్రౌండ్ ఫ్లోర్‌లో 33, మొదటి అంతస్తులో 34 కలిపి మొత్తం 67 దుకాణాలు నిర్మించారు. సెల్లార్‌లో కూరగాయలు, మాసం వ్యాపారాల కోసం 84 స్టాళ్లు నిర్మించారు. ఇందులోని 53 దుకాణాలను కేటాయించేందుకు 2023 ఫిబ్రవరి 8న వేలం ప్రక్రియ పూర్తి చేశారు. బిల్లుల రాలేదని గుత్తేదారు భవనాన్ని అప్పగించకపోవడంతో దుకాణాల కేటాయింపు నిలిచిపోయింది. తరవాత అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు దీనిపై శ్రద్ధ చూపకపోవడంతో ఏడాదిన్నరగా నిరుపయోగంగా మారింది. వేలం పాటల్లో పాల్గొనేందుకు రూ.50 వేలు డిపాజిట్ చేశామని, మరో రూ.2 లక్షల విలువైన సాల్వెన్సీ ధ్రువపత్రం సమర్పించామని వ్యాపారులు వాపోతున్నారు. వడ్డీల భారం పెరుగుతోందని తెలిపారు. సముదాయంలో మడిగెలు వస్తాయనే నమ్మకంతో ఇంతకుముందు వ్యాపారాలు నిర్వహించిన చోట ఖాళీ చేశామని చెబుతున్నారు. ప్రస్తుతం వ్యాపారాలు చేయలేక ఖాళీగానే ఉన్నామన్నారు. దుకాణాలు నిరుపయోగంగా ఉండడంతో దాదాపు నెలకు రూ.6 లక్షలకుపైగా రాబడిని పురపాలక సంఘం కోల్పోతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రక్రియ సాగుతోంది..

గుత్తేదారుకు బిల్లులు ఇప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. దుకాణాలు వెంటనే అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం. - జి.శ్రీనివాస్‌రెడ్డి, పురపాలక కమిషనర్.

అమ్మను దర్శించి.. భక్తితో ఉప్పొంగి..

మాతను దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలు, జంట నగరాలు, పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాలు అమ్మ నామస్మరణతో మార్మోగాయి. ప్రధాన ఆలయం వద్ద వరద ప్రవాహం ఉండటంతో తెల్లవారుజామునా రాజగోపురంలో అమ్మ వారి ప్రతిష్ఠామూర్తికి అర్చకులు పూజలు చేపట్టారు. పలువురు బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు. శనివారంతో పోలిస్తే ఆదివారం వరద ప్రవాహం కాస్త తగ్గింది. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 12,000 క్యూసెక్కుల వరద నీటిని కిందికి వదులుతున్నారు.

ఆమెకు ఆర్థిక భరోసా

- నారాయణఖేడ్‌లో క్యాంటీన్ ప్రారంభం
- వ్యాపారంలో రాణించేలా ప్రభుత్వ ప్రోత్సాహం

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, నారాయణఖేడ్

నారాయణఖేడ్‌లో మహిళా క్యాంటీన్

మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇంటి పని చేస్తూ.. మరోవైపు వ్యాపార రంగంలో రాణించేలా ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకుంది. స్వయం ఉపాధి ద్వారా ఆదుకోవాలన్న సంకల్పంతో చర్యలు చేపట్టింది. జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) కార్యాచరణ రూపొందించింది.

ఏర్పాటు చేసే ప్రాంతాలివే..

- సంగారెడ్డి ఎస్పీ కార్యాలయం
- సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణ
- తెల్లాపూర్
- జహీరాబాద్
- సదాశివపేట

రద్దీగా ఉన్న పట్టణాల్లో..

జిల్లాలో సంగారెడ్డి, అమీన్‌పూర్, సదాశివపేట, జోగిపేట- అందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్, ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్ పురపాలక సంఘాలు, వాటి పరిధిలో 5,189 మహిళా సంఘాలున్నాయి. అందులో 48,854 మంది సభ్యులున్నారు. వారికి ప్రభుత్వం ఈ ఏడాది ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. మహిళా సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు ఆర్థిక స్వావలంబన సాధించడంతోపాటు పలువురికి స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. జనం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. వాటి నిర్వహణకు మహిళా సభ్యులకు ఒక్కో క్యాంటీన్‌కు రూ.5- 10 లక్షల వరకు మెప్మా నుంచి రుణాలు ఇస్తున్నారు. గత నెలలో ఖేడ్‌లో క్యాంటీన్ ప్రారంభించారు. త్వరలో ప్రధాన పట్టణాల్లో నెలకొల్పేందుకు కసరత్తు చేస్తున్నారు.

- మెప్మా సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఆసక్తి ఉన్నవారికి క్యాంటీన్లు మంజూరు చేస్తారు.
- జనం రద్దీగా ఉండే చోట్ల ఏర్పాటు
- ఇతర హోటళ్ల కంటే భిన్నంగా ఉండేలా
- పరిశుభ్ర వాతావరణం కల్పించడం
- రుచి, నాణ్యత ఉండేలా చర్యలు
- స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా సమయపాలన పాటించడం
- అల్పాహారంతోపాటు భోజనం, తేనీరు, జొన్నరొట్టెలు, తెలంగాణ పిండి వంటలు.

08	పురపాలక సంఘాలు
199	వార్డులు
08	పట్టణ సమాఖ్యలు
192	సమాఖ్య సభ్యులు

సంఘాల సభ్యుల నుంచి చక్కటి స్పందన వస్తోంది..: గీత మెప్మా పీడీ, సంగారెడ్డి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటున్నాం. పట్టణ మహిళా సంఘాల సభ్యులకు ఇందిర మహిళా క్యాంటీన్ల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం లక్ష్యం. త్వరలో జిల్లాలోనూ అయిదు చోట్ల ప్రారంభిస్తాం.

నేడు సంగారెడ్డికి మంత్రుల రాక

సంగారెడ్డి అర్బన్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి సోమవారం మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి వస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఆర్డీవో రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోతిరెడ్డిపల్లిలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

B.Ed.
Ed-CET
without Ed-CET
Seats are Available
✆ 9866969622, 9912327209

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

శ్రీ చింత భూమయ్య - శ్రీమతి పోల రుక్మిణీ
Retd. Pharmacy Supervisor (PS HM MPPS Gollapally)
రుక్మిణి - శిక్షణా దక్షిత సులక్షిణి, గురువుని - విషయ విజ్ఞాన సంభోదిని
భూమా భామిని - సకుటుంబ సహిత సంరక్షిణి
35 సంవత్సరాలు అకుంఠిత దీక్షతో వృత్తి కర్తవ్యాన్ని, క్రమశిక్షణతో నిర్వర్తించి, ఎన్నో విద్యా కుసుమాలను విరియించి, అచంచల దృఢ దీక్షతో విద్యా పరిమళాలను విస్తరింపజేసి, సమస్తీకరించి మీ సత్తాను చాటారు. తేది: 30-9-2024 ఉద్యోగ బంధానికి మాత్రమే ఈ విరమణ తప్ప, మీలో ఉన్న విద్యాబోధనకు కాదని విశ్వసిస్తూ, ఆయురారోగ్యాలను ఆయుధాలుగా మలిచి, మీ శేష జీవితం ఆనందంగా గడపాలని ప్రార్థిస్తూ..
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు.

మధు భోగ, అంజమ్మ (మానస) భోగ, నవీన్ భోగ
APGVB (Ret)
చింతా శ్రీధర్, రూపా భోగ, రాధి చింతా
With Best Wishes
RAADHI & BHOGA ASSOCIATES
Banking and Insurance Services
✆ 73964 69814, 98493 05618

బతికుండగానే చనిపోయాడని..

ఫౌతిపట్టా మార్పిడి!

మోసం కేసులో పలువురిపై కేసు

నారాయణఖేడ్: వ్యక్తి బతికుండగానే చనిపోయాడని రెవెన్యూ అధికారులతో తప్పుడు పంచనామా చేయించి కొంత భూమిని అతడి కూతురి పేరిట మ్యుటేషన్ చేసి తరవాత... అదే(చనిపోయాడనే) వ్యక్తితోనే మిగిలిన భూమిని సేల్‌డీడ్ చేయించుకున్న ఘటనలో పలువురిపై పోలీసులు కేసు పెట్టారు. ఎస్సై విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఖేడ్ మండలం తుర్కపల్లికి చెందిన కుమ్మరి ఈరప్పకు విఠల్, ఈశ్వరి సంతానం. విఠల్ 2010లో, అతడి భార్య లింగమ్మ 2021లో మృతిచెందారు. విఠల్- లింగమ్మ దంపతులకు కుమారుడు సంతోష్ ఉన్నాడు. ఆయన తాత ఈరప్ప పేరిట గంగాపూర్‌లో వివిధ సర్వే సంఖ్యల్లో రెండెకరాల భూమి ఉంది. ఈరప్ప బతికుండగానే చనిపోయాడని అతడి కుమార్తె ఈశ్వరి.. గ్రామానికి చెందిన పరమేశ్వర్, సాయన్న, గంగారాం, శంకర్‌తో కలిసి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై 2017లో వారసత్వ పంచనామాతో 0.08 ఎకరాల భూమిని 2020 ఆగస్టు 29న ఫౌతిపట్టా మార్పిడి చేయించుకున్నారు. ఏడాది తరవాత తండ్రి ఈరప్పకు చెందిన మరికొంత భూమిని 2021 మార్చి 30న సెల్‌డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ రెండు ఘటనల్లో అధికారులు ఒకసారి ఈరప్ప బతికుండగానే చనిపోయాడని కొంత, తరువాత బతికి ఉన్న అతడితోనే మిగిలిన భూమిని ఈశ్వరికి రిజిస్ట్రేషన్ చేశారు. తాను వారసుడినని ఉండగా... అధికారులతో కుమ్మక్కై తన తాత భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై ఈరప్ప మనవడు సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈశ్వరి, పరమేశ్వర్, సాయన్న, గంగరాం, శంకర్‌లతోపాటు మరికొందరు రెవెన్యూ అధికారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హైడ్రా పేరుతో బెదిరింపు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: అక్రమంగా నిర్మించిన ఇళ్లను హైడ్రా అధికారులకు చెప్పి కూల్చి వేయిస్తామంటూ ఓ పత్రికా విలేకరి బెదిరించిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి బీఎస్ఆర్ కాలనీలో ఉంటున్న సంతోష్‌నాయక్ విలేకరిగా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం మద్యం తాగి ఐలాపూర్ పంచాయతీ కార్యాలయానికి వెళ్లాడు. నిర్మాణాలకు ఇచ్చిన అనుమతుల పత్రాలు ఇవ్వాలంటూ గ్రామ కార్యదర్శి సచిన్‌ను కోరాడు. వివరాలివ్వకపోతే హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసి నిర్మాణాలు కూల్చి వేయిస్తానని చెప్పాడు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థుడు స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కొట్టారంటూ ఫిర్యాదు..: తాను వివరాలు సేకరిస్తుండగా తనను గ్రామస్థులు స్తంభానికి కట్టేసి కొట్టారని సంతోష్ నాయక్ ముఖీమ్, అజీమ్, స్వామిలపై ఫిర్యాదు చేశారు. 40 మంది గ్రామస్థులు ఏకమై తనను హింసించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసుకున్నారు.

భాజపా బలోపేతానికి కృషి

సభ్యత్వ నమోదులో పాల్గొన్న గోదావరి అంజిరెడ్డి

కంది: భాజపాను మరింత బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సూచించారు. ఆదివారం మండల పరిధి మామిడిపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వచ్చేలా కష్టపడాలన్నారు. మండల అధ్యక్షుడు సదానంద చారి, రామస్వామిగౌడ్, ప్రవీణ్, సర్దార్ నాయక్, సేవ్యానాయక్ పాల్గొన్నారు.

సత్తా చాటేందుకు సిద్ధం

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జహీరాబాద్ అర్బన్

విద్యార్థులు ప్రతిభ కనబరిచేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమం డ్రామా ఫెస్టివల్.. ఇప్పటికే మండల స్థాయిలో పోటీలు ముగిశాయి. జిల్లాస్థాయి కోసం విద్యాశాఖ సమాయత్తమవుతోంది. సామాన్యశాస్త్రం ప్రధానాంశంగా పోటీలు జరుగుతాయి. విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపేందుకు సిద్ధమవుతున్నారు.

62 మంది నమోదు..

జిల్లాస్థాయి డ్రామా ఫెస్టివల్ కార్యక్రమం ఈనెల 30న జిల్లా సైన్స్ కేంద్రంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నారు. ఇప్పటికే మండల స్థాయిలో ప్రతిభ చూపిన 62 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు పేర్లు నమోదు చేసుకున్నారు. 'మానవ జాతి ప్రయోజనం కోసం శాస్త్ర సాంకేతికత' అనే అంశంపై డ్రామా ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నారు.

ఇవీ నిబంధనలు..

స్టేజీ డ్రామా 30 నిమిషాలు దాటొద్దు. ఒక ప్రదర్శనలో 8 మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పిస్తారు. ప్రతి బృందంలో ఒక డైరెక్టర్, స్క్రిప్ట్ రైటర్‌కు అనుమతి ఉంటుంది.

ప్రధాన అంశంతోపాటు అయిదు ఉప అంశాలను పొందుపరిచారు

- ప్రపంచ నీటి సంక్షోభం
- ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సొసైటీ
- విపత్తులను అరికట్టడానికి ఆధునిక సాంకేతికత
- ఆరోగ్య పరిరక్షణ
- వాతవరణ మార్పు, దాని ప్రభావం.

మార్కుల కేటాయింపు..

డ్రామా ఫెస్టివల్‌లో మార్కుల విధానాన్ని ప్రకటించారు. ప్రదర్శనకు 50, సైన్స్ అంశం, డ్రామాకు 30, ప్రభావితం చేసిన అంశానికి 20 చొప్పున మొత్తం 100 మార్కులు కేటాయిస్తారు.

జాతీయ స్థాయి వరకు అవకాశం..

జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన ప్రతి ఒక్కరినీ రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. నవంబరులో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. అక్కడ ప్రతిభ చూపితే దక్షిణ భారతదేశంలో, తరవాత జాతీయ స్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయిలో ఉత్తమంగా ప్రదర్శించిన విద్యార్థులకు రాష్ట్రపతిని కలిసే అవకాశముంటుంది.

విద్యార్థులు ప్రతిభ చూపాలి..: సిద్ధారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

జిల్లాస్థాయి డ్రామా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపాలి. సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నాం. సద్వినియోగం చేసుకోవాలి.

నియోజకవర్గంలో హైడ్రా లేదు: జగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో హైడ్రా లేదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల మాత్రమే హైడ్రా చర్యలుంటాయన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని అధికారులు అత్యుత్సాహం చూపరాదన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించానన్నారు. 'రింగు రోడ్డు బయట సంగారెడ్డి నియోజకవర్గం ఉంది. సీఎం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో కూల్చివేతలు ఉండవు. ఒక వేళ కూల్చాల్సి వస్తే ముందుగా నా దృష్టికి తేవాలి. సీఎంతో మాట్లాడతా' అని అధికారులనుద్దేశించి అన్నారు.

హోంగార్డు క్షేమంగా ఉన్నారు..: ఎస్పీ

మల్కాపూర్ పెద్దచెరువులో అక్రమ కట్టడం కూల్చివేత ఘటనలో గాయపడిన హోంగార్డు గోపాల్ క్షేమంగానే ఉన్నారని ఎస్పీ రూపేష్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాదులోని ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారన్నారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. వాటిని ఎవరూ నమ్మరాదన్నారు.

దశదినకర్మ

జననం: 1945

మరణం: 22-09-2024

కీ॥శే॥ మరం శామమ్మ ముదిరాజ్

అనురాగం, అప్యాయత, అనుబంధాలతో ఆదరించిన పుణ్యమూర్తి, మీరు మా నుండి దూరమై దైవసన్నిధికి చేరినా మీ జ్ఞాపకాలు చిరస్మరణీయం, మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ... బాధాతప్త హృదయాలతో...

కూతుళ్ళు - అల్లుళ్ళు:
వీరమణి - రాములు
తుల్జమ్మ (లక్ష్మి) - కే.శే. మల్లయ్య
చంద్రకళ - జగదీశ్వర్
శకుంతల - రమేష్
పద్మావతీ - పోచయ్య
మల్లేశ్వరీ - శ్రీనివాస్
రేణుక - వెంకటేష్

కుమారులు - కోడళ్ళు:
యం. నర్సింలు - లత
యం. శ్రీనివాస్ - రాజేశ్వరి
యం. సురేష్ - రాధ

మనుమలు - మనుమరాళ్ళు:
యం. వంశీ క్రిష్ణ - శిరీష
యం. సాయి కిరణ్ | డా॥ యం. మానస
యం. గ్రీష్మ శ్రీ | యం. వర్ష శ్రీ
యం. వైష్ణవి | యం. సాక్షిత

మునిమనుమరాలు: యం. విహాన క్రిష్ణ, మునిమనుమడు: యం. విశేష్ క్రిష్ణ

కార్యస్థలం: తేది: 30-09-2024 సోమవారం రోజు ఉ॥ 11.00 గం.లకు T.N.G.O.S భవన్, స్టేడియం గ్రౌండ్ ఎదురుగా, సంగారెడ్డి నందు నిర్వహించబడును.

మన సదాశివపేటలో
DUSSEHRA MAHOTSAVA
సద్దుల బతుకమ్మ మరియు దసరా ఆఫర్స్
ప్రతి ₹500 కొనుగోలు పై లక్కీ డ్రా కూపన్ పొందండి
TVS Star city Ex showroom price ₹63,000/- only
ప్రతి ఊరిలో ఒక 'బైక్' 'బంపర్ డ్రా' లో గెలుచుకునే అవకాశం
*T&C APPLY
FROM SEPTEMBER 23RD TO OCTOBER 11TH
కాసం ఫ్యాషన్స్ లో దసరా షాపింగ్ చెయ్యండి
గెలుచుకోండి అద్భుతమయిన TVS స్టార్ సిటీ బైక్ బహుమతిగా
KASAM FASHIONS
WE ♥ FASHION & FASHION AT KASAM
SAREES | KIDS | WOMENS | MENS | GHAGRAS
SUITING & SHIRTING
HANNAMKONDA | PARKAL | SHADNAGAR | BHADRACHALAM | JAMMIKUNTA | SADASHIVPET
VIKARABAD | MAHABUBABAD | PALWANCHA | SHANKARPALLY | GADWAL | JAGGAIAPET

(c) eenadu

ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి భరోసా

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉన్న ఊర్లో ఐదు కి.మీ. లోపు పని కల్పిస్తోంది. పేదలకు ఈ పథకం వరంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో వయోజనులలో ప్రతి కుటుంబానికి ఏడాది పాటు వంద రోజుల పని కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఉపాధి పనుల్లో ట్రాన్స్‌జెండర్లకు సైతం చోటు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. సమాజంలో వారిని చిన్నచూపు చూడకుండా సమాన అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. వారు కోరుకున్న చోట్ల జాబ్ కార్డు వెంటనే ఇవ్వాలని ఆదేశాలివ్వడం గమనార్హం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఈ దిశగా కసరత్తు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న వారిని చేర్పించేందుకు శ్రీకారం చుట్టారు.

జిల్లాల వారీగా ట్రాన్స్‌జెండర్లు	
సంగారెడ్డి	46
మెదక్	09
సిద్దిపేట	07
వికారాబాద్	138

పని చేస్తున్న కూలీలు

దరఖాస్తు ఇలా..

ఉపాధి హామీ పథకంలో చేరేందుకు ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల కోసం దరఖాస్తు ఫారంలో ప్రత్యేక కాలమ్‌ను రూపొందించారు. మండల స్థాయిలో ప్రోగ్రాం అధికారి (పీవో) లాగిన్‌లో జాబ్ కార్డు నమోదుకు అవకాశం కల్పించారు. పని కోరే వారి కుటుంబ సభ్యులందరికీ పని కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. జాబ్ కార్డులో చేర్పులు, మార్పులకు సైతం అవకాశం కల్పించారు.

వివక్ష చూపొద్దని..

పథకంలో చేరిన వారికి పని లేదని చెప్పి పక్కన పెడితే చట్టాన్ని ఉల్లంఘించినట్లేనని ఆదేశాల్లో స్పష్టంచేశారు. వారికి కచ్చితంగా పని చూపించాల్సిందే. అందరు కూలీలతో సమానంగా చూడాల్సిందే. పని ప్రదేశంలోనూ వివక్ష చూపొద్దు. తోటివారికి సైతం ఈ మేరకు అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారానికి జిల్లా, మండల స్థాయిలో ఓ నోడల్ అధికారిని సైతం నియమించాలని నిర్ణయించారు. పనుల కల్పనలో భాగంగా ఎదురయ్యే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

ఆదేశాలతో చర్యలు:

జ్యోతి, సంగారెడ్డి డీఆర్డీవో

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకంలో ట్రాన్స్‌జెండర్లకు పనుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. సంగారెడ్డి జిల్లాలో ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. మిగిలిన వారు పథకంలో చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నాం.

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సిద్దిపేట, నర్సాపూర్, గజ్వేల్

పర్యావరణహితం.. యువ అభిమతం

పర్యావరణ హితమే లక్ష్యంగా డిగ్రీ విద్యార్థులు అడుగులేస్తున్నారు. కళాశాలల్లో ఏకో క్లబ్‌లు ఏర్పాటుచేసుకొని ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. అధ్యాపకుల సహకారంతో క్లబ్‌ల ఆధ్వర్యంలో కళాశాలతో పాటు సమీప గ్రామాల్లోనూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ మన్ననలు అందుకుంటున్నారు.

మొక్కలు నాటి..

మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు.. ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఏకో క్లబ్ ఏర్పాటైంది. వృక్షశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ మురళి కన్వీనర్‌గా, అధ్యాపకులు రాజు, విశ్వనాథం సభ్యులుగా కొనసాగుతున్నారు. మొత్తం 150 మంది సభ్యులుగా ఉన్నారు. ఏటా కళాశాలలో పలు మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ఇటీవల క్యానోపీ అనే ప్రత్యేక రకానికి చెందిన 30 మొక్కలు నాటారు. నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలు పెంచేలా కృషి చేస్తున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా వృక్షాబంధన్ చేపట్టారు. పట్టణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. తాజాగా నీటి వసతి లేని చోట మొక్కల పెంపకానికి వీలుగా ఎకరాకు సరిపడా 200 విత్తన బంతులు తయారు చేశారు. పాతూర్ శివారులోని అడవిలో వెదజల్లారు.

త్వరలో ఏర్పాటు..

వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ కమిటీని త్వరలో ఏర్పాటుచేయనున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పీవీ గీతా లక్ష్మి పట్నాయక్ ఆధ్వర్యంలో ఈ దిశగా కృషి జరుగుతోంది. అక్టోబరు 1న విద్యార్థులు, అధ్యాపకులతో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పలు కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించారు.

మెదక్‌లో విత్తన బంతులతో విద్యార్థులు

స్కాన్‌తో చరిత్ర తెలిసేలా.

విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ కల్పనతో సిద్దిపేటలోని స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందంజలో ఉంటోంది. వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏకో క్లబ్ కీలకపాత్ర పోషిస్తోంది. కళాశాలలో 1500కి పైగా మొక్కలు, చెట్లు పెంచుతున్నారు. కూరగాయలు, ఔషధ, తులసీ, రోజాపూల ఉద్యానాలు నిర్వహిస్తున్నారు. కన్వీనర్‌గా వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. రాణి కొమ్మిడి, సభ్యులుగా ఐదుగురు అధ్యాపకులు వ్యవహరిస్తున్నారు. ఏటా ప్రథమ సంవత్సర విద్యార్థులకు సభ్యత్వం కల్పిస్తున్నారు. ఇలా 60 మంది భాగస్వాములవుతున్నారు. 15 రోజులకో సారి స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 500 మొక్కలకు క్యూఆర్ కోడ్‌లను బిగించారు. స్మార్ట్ చరవాణి నుంచి స్కాన్ చేస్తే.. వివరాలన్నీ తెలిసిపోతాయి. దీన్ని ఏళ్లుగా సాగిస్తున్నారు.

న్యూస్‌టుడే, మెదక్ టౌన్, సిద్దిపేట, వికారాబాద్ కలెక్టరేట్

చదువుతూనే ఉద్యోగం..

స్వశక్తితో యువతుల రాణింపు

ప్రస్తుత తరుణంలో అత్యధిక శాతం యువత సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారి విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను విస్మరిస్తున్నారు. కుటుంబ స్థితిని లెక్క చేయక అడ్డగోలుగా ఖర్చు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఇందుకు భిన్నంగా మరికొందరు కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తూ.. సొంతకాళ్లపై నిలబడుతున్నారు. చదువు సాగిస్తూనే ఉద్యోగం చేస్తూ లక్ష్యాన్ని చేరేందుకు శ్రమిస్తున్నారు. ఈ కోవకు చెందిన ఇద్దరు యువతులు డిగ్రీ దశలోనే యోగా శిక్షకులుగా మారి పది మందికి ఆదర్శంగా నిలుస్తుండటం విశేషం. ప్రతిభను నిరూపించుకునేందుకు ఎక్కడ పోటీలు నిర్వహించినా పాల్గొంటున్నారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో తమ ప్రత్యేకతను చాటేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా వారిని 'న్యూస్‌టుడే' పలకరించింది. ఆయా విశేషాలు ఇలా..

నాన్న మరణం కదిలించింది..:

సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాలలో బీజడ్‌సీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. వ్యాస మహర్షి యోగా సెంటర్‌లో శిక్షకురాలిగా చేస్తున్నా. ఆసక్తి ఉన్న వారికి ప్రత్యేకంగా బోధిస్తున్నా. గతంలో ప్రైవేటు పాఠశాలలో బోధించా. ఆరో తరగతి నుంచి యోగాపై ఆసక్తి ఏర్పడింది. రాష్ట్రస్థాయిలో పది, జాతీయస్థాయిలో ఎనిమిది సార్లు పాల్గొన్నా. గతంలో సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ సహకారంతో నిర్వహించిన యోగా ఇన్‌స్ట్రక్టర్ కోర్సు పూర్తి చేసి.. అర్హత సాధించా. పిల్లలకు చెబుతూ సాధన చేస్తున్నా. జాతీయస్థాయిలో పతకం సాధించడమే లక్ష్యం. ఏడాది కిందట నాన్న మల్లేశం అనారోగ్యంతో చనిపోయారు. దీంతో శిక్షకురాలిగా మారాల్సి వచ్చింది. సొంతకాళ్లపై నిలబడితే ఆ ఆనందం వేరు. కుటుంబానికి బాసటగా మారా. **ఎ.మనీషా**

యోగానే లోకమైంది..

- ఎల్.సింధూరి

మా సొంతూరు కొండపాక మండలం మర్పడ్గ. సిద్దిపేటలోని మహిళా డిగ్రీ కళాశాలలో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. అక్కడ చదువును కొనసాగిస్తూనే ఏడాదిగా ఓ ప్రైవేటు పాఠశాలలో యోగా శిక్షకురాలిగా ఉద్యోగం చేస్తున్నా. ఒకప్పుడు యోగా అంటే కనీస అవగాహన లేదు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదివే క్రమంలో పీఈటీ సతీశ్ యోగా వైపు మళ్లించారు. అప్పటి నుంచి రాష్ట్ర స్థాయిలో పదిసార్లు, జాతీయస్థాయిలో నాలుగు సార్లు పోటీల్లో పాల్గొన్నా. ప్రస్తుతం నిజామాబాద్‌లో జరుగుతున్న సంప్రదాయ పోటీల్లో పాల్గొంటున్నా. ప్రస్తుతం యోగానే లోకమైంది. పోటీలు ఉంటే నిత్యం, మిగిలిన సందర్భాల్లో పాఠశాలలో పిల్లలకు బోధిస్తూ సాధన చేస్తున్నా. పోలీసు కొలువు సాధనే లక్ష్యం.

న్యూస్‌టుడే, సిద్దిపేట

నేటి నుంచి ఓటరు నమోదు ప్రక్రియ

పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి సమరం

ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, మెదక్: మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఓటరు నమోదు ప్రక్రియ సోమవారం షురూ కానుంది. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రస్తుతం 15 జిల్లాలున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఇప్పటికే కలెక్టర్లు నమోదుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో ఓటరుగా నమోదు చేసుకొనే అవకాశముంది. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో, స్కూల్ అసిస్టెంట్, జేఎల్‌లు(జూనియర్ లెక్చరర్లు), డీఎల్‌లు(డిగ్రీ లెక్చరర్లు), యూడైస్‌లో నమోదైన ప్రైవేటు పాఠశాలల్లోని టీచర్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేయవచ్చు.

డిసెంబరు 30న తుది జాబితా: ప్రస్తుతం ఈ స్థానం నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కె.రఘోత్తమ్‌రెడ్డి కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది మార్చి 29తో వీరి పదవీ కాలం ముగియనుంది. ఈ ఏడాది నవంబరు తొలి వారం నాటికి కొత్త ఓటరు జాబితాను రూపొందించాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. సవరణలు, ఆక్షేపణలకు గడువు ఇచ్చి డిసెంబరు 30న తుది ఓటరు జాబితా వెల్లడించనున్నారు.

కొత్తగా నమోదు..: ఐదేళ్ల కిందట ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఓటేసిన, వేయని వారంతా తిరిగి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. 2019 మార్చిలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈ సారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఎక్కువ మంది ఓటర్లున్నారు. ఈ సారి 15 జిల్లాల పరిధిలో పట్టభద్రులతో పాటు ఉపాధ్యాయు ఓటును నమోదు చేసుకోవాలి. సీఈవో తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా ఫారమ్-18లో వివరాలు నమోదు చేయాలి. డిగ్రీ మార్కుల మెమోతో పాటు ఆధార్ సహా ఇతర పత్రాలు జోడించాలి. వాటిని తహసీల్దారు కార్యాలయాల్లో అందజేయాలి. 2021 నవంబరులోగా డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల స్థానానికి ఓటు నమోదు చేసుకోవచ్చు.

2019 జాబితా ప్రకారం..

విభాగం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఉపాధ్యాయ	15,892	7,322	-	23,214
పట్టభద్రులు	1,35,218	61,077	26	1,96,321

ముగిసిన అటవీశాఖ జోనల్ క్రీడోత్సవాలు

ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న సిద్దిపేట-మెదక్ జోన్ జట్టు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రెండు రోజులుగా కొనసాగుతున్న రాజన్నసర్కిల్ అటవీశాఖ రెండో జోనల్ క్రీడోత్సవాలు ఆదివారం ముగిశాయి. సిద్దిపేట, మెదక్, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి జిల్లాలకు చెందిన సుమారు 200 వందల మంది ఉద్యోగులు పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. మొత్తం 104 అంశాల్లో పురుషులు, మహిళలు, సీనియర్ వెటరన్స్ జూనియర్ వెటరన్స్ విభాగాల్లో ఉద్యోగులు ప్రతిభ చూపారు. 406 పాయింట్లతో సిద్దిపేట-మెదక్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. విజేతలకు సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్ జిల్లాల అటవీశాఖ అధికారులు శ్రీనివాస్, నిఖిత, బాలమణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. క్రీడలను వ్యాయామోపాధ్యాయులు రామేశ్వర్‌రెడ్డి, సుజాత, వెంకటస్వామిగౌడ్, ఉప్పలయ్య, కనకారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజ్‌మోహన్‌గౌడ్ పర్యవేక్షించారు.

ఆసుపత్రులు, మెట్రోస్టేషన్లే లక్ష్యంగా చోరీలు

సికింద్రాబాద్: నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, మెట్రోస్టేషన్ల వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా చోరీ చేస్తున్న దొంగను చిలకలగూడ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.10 లక్షల విలువ చేసే 18 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం స్థానిక ఠాణాలో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వివరాలు వెల్లడించారు. కామారెడ్డికి చెందిన శ్రీనివాస్ కూలీ పనులు చేస్తున్నాడు. కుటుంబ పోషణకు డబ్బు చాలక నగరంలోని చర్లపల్లికి వచ్చి బైకుల చోరీ మొదలుపెట్టాడు. దొంగిలించిన వాహనాన్ని తక్కువ ధరకు విక్రయిస్తుంటాడు. రెండ్రోజులుగా గాంధీ ఆసుపత్రి ఆవరణలో బైకులు మాయమవుతుండగా, బాధితుల ఫిర్యాదుతో చిలకలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్ నేతృత్వంలోని సిబ్బంది మాటు వేసింది. సీసీ ఫుటేజీల ఆధారంగా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. నీలోఫర్, ఈఎస్ఐ, ఉస్మానియా ఆసుపత్రులు, మియాపూర్, మెట్టుగూడ, నాంపల్లి మెట్రోస్టేషన్లు, మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పార్కింగ్ చేసిన బైకులు దొంగిలించినట్లు అంగీకరించాడు. శ్రీనివాస్‌తో పాటు బైకులు కొనుగోలు చేసిన ఏసురత్నం, శాంతారావును అదుపులోకి తీసుకున్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	115-00	డ్రెస్డ్	199-00
రిటైల్	137-00	స్కిన్‌లెస్	226-00

సాహిత్య కోవెల మరసం

సిద్దిపేట, న్యూస్‌టుడే: మరసం సాహిత్య కోవెల అని, ఎంతో మంది మేధావులు పుట్టుకొచ్చారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. మంజీరా రచయితల సంఘం(మరసం) 38వ వార్షికోత్సవాన్ని సిద్దిపేట విపంచి కళానిలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించి, వివిధ కారణాలతో మృతి చెందిన సంఘం ప్రతినిధులు, సామాజిక, సాహితీవేత్తలకు నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాశరథి స్ఫూర్తితో సాహితీవేత్తలు పోరాటం సాగించారని పేర్కొన్నారు. సాహితీవేత్త, ఆంధ్రజ్యోతి పత్రికా సంపాదకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మంజీరా మహానదిలా మరసం ప్రవహించిందని, మళ్లీ ఉపనదిలా మారాలన్నారు. సాహిత్యానికి ప్రాతినిధ్యం వహించి మార్గదర్శనం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ మరసం తనలో పోరాట స్ఫూర్తిని నింపిందన్నారు. ఎన్నో విషయాలను సంఘం నుంచి నేర్చుకున్నానని, ధూంధాం అనే ఆలోచన కల్పించిందన్నారు. ప్రముఖ సాహితీవేత్త, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, ప్రొఫెసర్ కాశీం, మరసం అధ్యక్షుడు కె.రంగాచారి మాట్లాడారు. అనంతరం దేశపతి శ్రీనివాస్ రచించిన జయజయహే తెలంగాణ పాటల పుస్తకం, మరసం కవులు రచించిన జోట పాటలు సంకలనం, సిద్దెంకి యాదగిరి రచించిన మూడు గుడిసెల పల్లె పుస్తకాలను ఆవిష్కరించారు. టీఎన్జీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవిప్రసాద్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరం, ప్రతినిధులు సిద్దెంకి యాదగిరి, తోట అశోక్, పరమేశ్వర్, తిరుపతిరెడ్డి, అంజయ్య ఉన్నారు.

హాజరైన సంఘ ప్రతినిధులు, సాహితీవేత్తలు

పుస్తకాల ఆవిష్కరణలో ప్రొఫెసర్ కాశీం, సాహితీవేత్త కె.శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్. చిత్రంలో ఎడమ నుంచి కుడి వైపు సిధారెడ్డి, విరాహత్‌అలీ, రంగాచారి, యాదగిరి తదితరులు

క్రీస్తును స్తుతించి.. ప్రార్థనలు చేపట్టి

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం కరుణామయుడి నామస్మరణతో మార్మోగింది. గురువులు శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించారు. ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ఆరాధన చేపట్టారు. రిటైర్డ్ ప్రెసిబిటరీ శ్రీనివాస్‌రావు దైవసందేశాన్ని వినిపించారు. వివిధ ప్రాంతాల చెందిన భక్తులు, పర్యాటకులు ఏసయ్యను దర్శించుకుని పరవశించారు. గురువులు భక్తులను ఆశీర్వదించారు.

ప్రార్థనా మందిరంలో భక్తులు

వినూత్నం.. కేవీకే భవనం

15 ఎకరాల విస్తీర్ణం.. ఎర్రరాయితో నిర్మించిన భవన సముదాయం.. చుట్టూ పచ్చదనంతో ఆకట్టుకుంటోంది సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం దిడ్గి శివారులోని కృషి విజ్ఞాన కేంద్రం. 1994లో దీన్ని నిర్మించారు. దీని ఆవరణలో వివిధ రకాల పంటల క్షేత్రాలు, పండ్ల తోటలతో పాటు ఔషధ నగరి సైతం ఉంది. ఇక పరిపాలనా భవనాన్ని పూర్తిగా ఎర్రరాయితో నిర్మించారు. అప్పట్లో సిమెంటుకు బదులుగా డంగు సున్నం ఉపయోగించడం విశేషం. సముదాయాన్ని వృత్తాకారంలో రెండు అంతస్తులలో నిర్మించారు. కేంద్రంలో ఉద్యాన, వ్యవసాయ విస్తరణ, గృహ విజ్ఞాన, పశుపోషణ తదితర విభాగాలకు చెందిన ఏడుగురు శాస్త్రవేత్తలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో విభాగానికి ఒక్కో గదిని కేటాయించారు. అందులో పైకప్పు వృత్తాకారంలో, వాటి ద్వారాలు పిట్టగూళ్లను తలపించేలా ఉంటాయి. భోజనశాల సైతం వృత్తాకారంలో ఏర్పాటుచేశారు. ఇభవనం మధ్యలో విశాలమైన స్థలం, అతిథులు బస చేసేందుకు వసతులు ఉన్నాయి.

- న్యూస్‌టుడే, జహీరాబాద్

తెలంగాణ భవన్ ముట్టడిస్తాం: ప్రాజెక్టుల నిర్వాసితులు

మాట్లాడుతున్న నిర్వాసితులు

గజ్వేల్ గ్రామీణ: పేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటని ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడటం... దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ జలాశయాల నిర్వాసితులు వ్యాఖ్యానించారు. ఇటీవల హైదరాబాద్‌లో 'హైడ్రా' చర్యల వల్ల ఆస్తులు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులతో హరీశ్‌రావు మాట్లాడిన తీరును జలాశయాల నిర్వాసితులు ఎద్దేవా చేశారు. గతంలో భారాస ప్రభుత్వం చేసిన విధ్వంసాలను తెలియజేసేందుకు కన్నెపల్లి నుంచి కొండపోచమ్మ ప్రాజెక్టు నిర్వాసితుల వరకు అందరితో కలిసి తెలంగాణ భవన్‌ను ముట్టడిస్తామని తెలిపారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్మాణంలో వందలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే రాని ఏడుపు హరీశ్‌రావుకు ఇప్పుడు ఎలా వస్తోందన్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులపై లాఠీఛార్జీ చేసి, 144 సెక్షన్ పెట్టినప్పుడు.. మల్లారెడ్డి అనే నిర్వాసితుడు తన చితిని తానే పేర్చుకొని ఆత్మహత్య చేసుకున్నపుడు ఆయనకు ఎందుకు దుఃఖం రాలేదని ప్రశ్నించారు. తమ హక్కులను అడిగినప్పుడు కేసులు నమోదు చేయించిన విషయం గుర్తుచేసుకోవాలన్నారు. నిర్వాసితులకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ, పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేసే హరీశ్‌రావు ఆస్తులు, ఫాంహౌస్‌లపై విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. జలాశయాల భూ నిర్వాసితులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు భానుప్రకాష్‌రావు పాల్గొన్నారు.

చోరీలకు వచ్చి.. పోలీసులకు చిక్కి

ముగ్గురు అరెస్టు, పరారీలో నలుగురు

నర్సాపూర్: చోరీలకు వచ్చిన ముగ్గురు దొంగలు నర్సాపూర్ పోలీసులకు చిక్కారు. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నర్సాపూర్‌లో శనివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బానోత్ రాములు, రాథోడ్ తారాసింగ్, రాథోడ్ జయరాం పోలీసులకు చిక్కారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో ఏడుగురు దొంగల ముఠాకు చెందిన వారుగా తేలింది. వీరంతా సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలానికి చెందిన వారు. ఆయా కేసుల్లో నిందితులు, పాతనేరస్థులు. సమయానుసారంగా ఐదారుగురు కారులో వచ్చి రాత్రి పూట తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడతారు. గతంలో మెదక్, సంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి, విలువైన బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఘటనలున్నాయి. నర్సాపూర్ మండలం నత్నాయిపల్లి, చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్, చండూర్, జిన్నారం మండలం సోలక్‌పల్లి, దాదిగూడెంలో చోరీలకు పాల్పడినట్లుగా వెల్లడైంది. ఇలా పీఎస్ నర్సాపూర్-2, చిలప్‌చెడ్-2, జిన్నారం-2లో మొత్తం ఆరు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. పట్టుకున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 12 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. మరో నలుగురు విజయ్‌కుమార్, రమేశ్, రాజు, రవిలను త్వరలో పట్టుకుంటామన్నారు. ఎస్సై లింగం తదితరులున్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఆదివారం నగర శివారులోని మొగిలిచర్ల క్రికెట్ మైదానంలో వరంగల్, మెదక్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 49.2 ఓవర్లలో 219 పరుగులు చేసింది. జట్టులో వితేష్ 31 పరుగులు(3 వికెట్లు), రిష్యాంత్ 31 పరుగులు(3 వికెట్లు) తీశారు. ఛేదనకు దిగిన మెదక్ జట్టు 29.4 ఓవర్లలో 110 పరుగులకే ఆలౌట్ అయ్యింది. కోమటిపల్లి మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, నల్గొండ జట్లు తలపడగా మహబూబ్‌నగర్ జట్టు గెలిచింది.

ప్రాణాలు.. గల్లంతు!

లోతట్టు వంతెనల వద్ద తరచూ ప్రమాదాలు

- జహీరాబాద్ మండలం బూచినెల్లి వద్ద బుధవారం వంతెన మీదుగా నారింజ వాగును బైక్‌తో దాటుతూ ఒకరు గల్లంతవగా మరొకరు ముళ్ల పొదలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం దొరికింది.
- న్యాల్‌కల్ మండలం చాల్కి-అమీరాబాద్ మధ్యలో వాగును రాత్రివేళ బైక్‌తో దాటుతూ వరదలో కొట్టుకుపోయి యువకుడు మృతిచెందగా మరొకరు ప్రాణాలతో బయటపడ్డాడు.
- జహీరాబాద్ మండలం సత్వార్‌లోని బంధువుల ఇళ్లకు వచ్చి గ్రామంలోని లోలెవల్ వంతెనను కాలినడక దాటుతూ ఇద్దరు వరద ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందారు.

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

ఇవీ.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డివిజన్‌లోని భారీ వర్షాలు కురిసి వాగులు పొంగడంతో లోతట్టు (లోలెవల్) వంతెనల వద్ద వరద నీటిలో కొట్టుకుపోయి మృత్యువాత పడిన ప్రమాద ఘటనల్లో కొన్ని. 'భారీ వర్షాలు కురిసినప్పుడల్లా వాగులు పొంగుతున్నాయి.. వంతెన మీదుగా వరద ఉద్ధృతంగా పారుతుండటంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు నిలిచిపోతున్నాయి. ఆయా వంతెనల ఎత్తు పెంచాలన్న డిమాండ్ ఏళ్లుగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏటా వానాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా పాట్లు తప్పడం లేదు.

జహీరాబాద్ సబ్ డివిజన్ పరిధిలో ప్రధాన రహదారుల్లోని లోతట్టు వంతెనల వద్ద చోటుచేసుకుంటున్న ప్రమాదాలు వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం, రాయికోడ్ మండలాల్లోని అంతర్రాష్ట్ర రహదారులతో పాటు ఇతర దారుల్లో లోలెవల్ వంతెనల వద్ద ప్రమాదకర పరిస్థితి నెలకొంది.

బూచినెల్లి వద్ద బైక్‌ను ఇలా దాటిస్తూ..

వరద ప్రవాహం తెలియక..

వాగుల్లో నీళ్ల లేని సమయాల్లో చిన్నపాటి వంతెనలుగా కనిపించిన లో లెవల్ వంతెనల వద్ద భారీ వర్షాలు కురిసినప్పుడు మాత్రం వరద ఉద్ధృతి ప్రమాదకరంగా ఉంటోంది. అటు వైపు నిత్యం తిరుగుతున్న వారే వాగు ప్రవాహాలకు ప్రమాదాలకు గురవుతున్నారంటే ఇక కొత్తగా వచ్చే వారి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వంతెనల వద్ద రోడ్డు కోతకు గురవుతుండటంతో గుంతలు ఏర్పడుతున్నాయి.

ఉద్ధృతంగా పారుతున్న నారింజ వాగు

హెచ్చరికలతో అప్రమత్తం..

ప్రమాదాలు జరుగుతున్న చోట ర.భ శాఖ, పంచాయతీరాజ్ రోడ్ల విభాగం అధికారులు హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. భారీ వర్షాలు కురిసినప్పుడు వాహనాలతో వాగులు దాటకుండా గ్రామ పంచాయతీల సిబ్బందిని సమన్వయం చేస్తూ పోలీసు శాఖ ప్రత్యేకంగా కాపలాదారులను నియమిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉటుంది.

పరిశీలించి చర్యలు చేపడతాం..:

డివిజన్‌లోని లో లెవల్ వంతెనలు పరిశీలిస్తాం. ఇటీవల జరిగిన ప్రమాద ఘటనలపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం. మరిన్ని ఘటనలు జరగకుండా బోర్డుల ఏర్పాటు కృషి చేస్తాం.

రాంచందర్, డీఈఈ పీఆర్ జహీరాబాద్

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

పెద్దేముల్, న్యూస్‌టుడే: కడుపునొప్పి భరించలేక ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం కందనెల్లి తండాలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ గిరి తెలిపిన వివరాలు.. కందనెల్లి తండాకు చెందిన మహదేవ్, రోమిబాయి (49) దంపతులకు కుమారుడు సంతోష్ ఉన్నాడు. సంతోష్‌కు వివాహం కాగా, అందరూ కలిసి ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. కొన్నాళ్లుగా మహదేవ్ ఆరోగ్యం బాగాలేక ఇంటికే పరిమితమయ్యాడు. కొడుకు, కోడలు వ్యవసాయం చేస్తున్నారు. రోమిబాయి కూలీ పనులకు వెళ్లేది. తరచూ కడుపు నొప్పి రావడంతో మూడేళ్ల కిందట శస్త్ర చికిత్స ద్వారా గర్భసంచి తొలగించారు. కొంత కాలం తర్వాత మళ్లీ కూలీ పనులకు వెళ్తోంది. ఇటీవల తిరిగి కడుపు నొప్పి ఎక్కువైంది. దీంతో మనోవేదనకు గురైన రోమిబాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం దూలానికి తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. దీన్ని గమనించిన స్థానికులు వెంటనే ఆమెను తాండూరు జిల్లా ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. సంతోష్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

(c) eenadu

ఆత్మరక్షణకు కరాటే విద్య దోహదం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, న్యూస్‌టుడే: ఆత్మరక్షణకు కరాటే విద్య ఎంతో అవసరమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన కరాటే పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అపర్ణ పాటిల్, ఉపాధ్యక్షుడు చింతా గోపాల్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అమూల్యమ్మ, భారాస నాయకుడు శివరాజ్‌పాటిల్, కరాటే మాస్టర్లు శంకర్‌గౌడ్, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

సదాశివపేట, న్యూస్‌టుడే: అన్ని దానాలకంటే రక్తదానం గొప్పదని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం గురుస్వామి వోడేల ప్రభుస్వామి జ్ఞాపకార్థం అయ్యప్ప ఆలయంలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు పర్ణపాటిల్, ఉపాధ్యక్షుడు చింతా గోపాల్, గురుస్వాములు గోనేశంక్, రవీందర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థి ప్రతిభ

జిన్నారం, న్యూస్‌టుడే: ఐడీఏ బొల్లారం పట్టణంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ప్రతాప్ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపల్ శ్రీదేవి చెప్పారు. ఈ మేరకు విద్యార్థిని అభినందించారు. పోస్టర్ మేకింగ్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రణీత్ ప్రతిభ చాటగా ప్రశంసాపత్రం, అవార్డును డీఈవో వెంకటేశ్వర్లు అందించినట్లు చెప్పారు.

ప్రతివారం సంగారెడ్డికి వస్తా: మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి నియోజకవర్గ కార్యకర్తలు ఎవరూ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు రావొద్దని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆదివారం పేర్కొన్నారు. ప్రతివారం తానే సంగారెడ్డికి వచ్చి తన నివాసంలో ప్రజల సమస్యలు, ఫిర్యాదులు తెలుసుకుంటానని తెలిపారు. అత్యవసరంలో టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంజనేయులును సంప్రదించాలని సూచించారు.

యువత చొరవ.. విజ్ఞానానికి సోపానం

న్యూస్‌టుడే, నారాయణఖేడ్, జహీరాబాద్

సాధారణంగా మండల కేంద్రాల్లోనే ప్రభుత్వపరంగా గ్రంథాలయాలు ఉంటాయి. పల్లెవాసులు మండల కేంద్రాలకు వచ్చి వీటిని సద్వినియోగం చేసుకునే పరిస్థితులు అంతంతే. గ్రామాలకు దినపత్రికలు ఆలస్యంగా అందుతాయి. వివిధ కోర్సుల్లో ప్రవేశాలు, ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో వారికి ఉండవు. వివిధ పనులు, పాఠశాలలు ముగించుకుని వచ్చిన వారు సాయంత్రం వ్యసనాలవైపు ఆకర్షితులవుతుండటం ఆయా గ్రామాల యువతను ఆలోచింపజేసింది. సర్వరోగ నివారిణిగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తే మంచిదనే అభిప్రాయానికి వచ్చారు. వారి చొరవతో ఖేడ్ మండలం హన్మంతరావుపేట, తుర్కపల్లి, మాధ్వార్, అనంతసాగర్‌లతోపాటు పలు గ్రామాల్లో గ్రంథాలయాలు ఈ ఆలోచన నుంచే ఏర్పాటయ్యాయి.

మాధ్వార్‌లో పత్రికలు, పుస్తకాలు చదువున్న పెద్దలు, యువకులు

యువకులకే ప్రత్యేకం..

తుర్కపల్లిలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని మూడేళ్ల కిందట గ్రామ యువకులు నిర్ణయించారు. దీనికోసం 'స్నేహ పూర్వ యూత్ అసోసియేషన్' ఏర్పాటు చేసుకున్నారు. నిధుల సమస్యను అధిగమించడానికి గ్రామ పెద్దలకు విషయం చెప్పారు. సంతోషించిన వారు సహకరించి తలాకొంత విరాళం అందించారు. రూ.50 వేల వరకు పోగయ్యాయి. దీంతో వివిధ పుస్తకాలు కొనుగోలు చేసి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పాఠశాల హెచ్‌ఎం మహనీయుల గాథలకు సంబంధించి 200 పుస్తకాలను సమకూర్చారు. ప్రస్తుతం 1,000కి పైగా పుస్తకాలు ఉండగా వాటిలో టీజీపీఎస్సీ గ్రూప్-1, గ్రూప్-2, తెలుగు లిటరేచర్ తదితర పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి.

సమాచారానికి దోహదం: వెంకట్, తుర్కపల్లి

గ్రామంలో ఇళ్లకు తెప్పించుకునే పత్రికలు ఆలస్యంగా వచ్చేవి. గ్రంథాలయం ఏర్పాటుతో పలు పత్రికలు ఉదయాన్నే వస్తున్నాయి. చిన్నలు, పెద్దలనే తేడాలు లేకుండా వాటిని చదువుతూ సమాచారం తెలుసుకుంటున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఈ గ్రంథాలయం చాలా ఉపయోగపడుతోంది.

పేదలకు మేలు: డాకాగౌడ్, తుర్కపల్లి

పేద విద్యార్థులు, నిరుద్యోగ యువతకు గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న గ్రంథాలయాలు ఎంతగానో మేలు చేకూర్చుతున్నాయి. టెట్‌కు ప్రిపేర్ కావడానికి పుస్తకాలు దోహదపడ్డాయి. ఇక్కడే అందుబాటులో ఉండటంతో నాకు వ్యయప్రయాసలు తప్పాయి. గ్రామంలో సుమారు 50 మంది వివిధ కోర్సులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతుండగా వారికి సైతం ఇవి ఉపయోగకరంగా ఉన్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)

సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363

నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250

అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, జోగిపేట, జహీరాబాద్: ? అందోలు గ్రామం ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు విరిగిపోయింది. గ్రామం జాతీయ రహదారిపై ఉండటం వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి స్థానిక గ్రామం పేరు తెలియడం లేదు. **–రాజు, అందోలు.**

✓ విరిగిపోయిన సైన్ బోర్డును ప్రయాణికులకు కనిపించేలా ఏర్పాటు చేయిస్తాం. **–రవీందర్, డిప్యూటీ ఈఈ ర,భ శాఖ అందోలు.**

? జోగిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ప్రాథమిక పాఠశాల సమీపంలోని రహదారి పక్కన విద్యుత్ నియంత్రిక ప్రమాదకరంగా మారింది. కంచె లేకపోవడంతోపాటు దాని చుట్టూ పొదలు పెరిగాయి. వీటివల్ల అటుగా వచ్చే జీవాలకు ఎర్తింగ్ తగిలి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. **–ప్రవీణ్‌కుమార్, జోగిపేట.**

✓ నియంత్రిక చుట్టూ పొదలు తొలగించి కంచెను ఏర్పాటు చేయిస్తాం. **–శ్రీనివాస్, ఏఈ విద్యుత్ శాఖ అందోలు.**

? జహీరాబాద్ పట్టణంలోని విద్యుత్తునగర్ కాలనీలో మిషన్ భగీరథ నీరు రాక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైను వేసినప్పటికి సరఫరాకు అవస్థలు తప్పటం లేదు. **–బస్వరాజ్, కాలనీ వాసి.**

✓ చిన్నపాటి లోపాల కారణంగా కొన్ని ప్రాంతాలలో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. పరిశీలించి సమస్య పరిష్కారిస్తాం. **–దీప్‌చంద్, డీఈఈ పురపాలక సంఘం.**

? సంగారెడ్డిలోని ఓడీఎఫ్ కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. **–శివ కుమార్, సంగారెడ్డి.**

✓ తాత్కాలికంగా మొరం వేయించి సమస్య పరిష్కరిస్తాం.

– ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ.

ఎమ్మెల్యే హామీ.. తక్షణ స్పందన

నారాయణఖేడ్: ఖేడ్ జూకల్ శివారులోని మహాత్మా జ్యోతిబాపులే బాలుర బీసీ గురుకులాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేయగా పలు సమస్యలు ఆయన దృష్టికి వచ్చాయి. గురుకుల మైదానంలో హైమాస్ట్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాత్రికి రాత్రి హైమాస్ట్ దీపాలను ఫిటింగ్ చేయించారు. డైనింగ్ హాల్‌లో అత్యవసరంగా 4 ఫ్యాన్లు, 8 ట్యూబ్ లైట్లను ఏర్పాటు చేయించారు. మిగిలిన 80 ఫ్యాన్లను, ట్యూబులను అతిత్వరలో మరమ్మతులు చేయించి ఫిటింగ్ చేయించేలా పురపాలిక ఉప ఛైర్మన్ దారం శంకర్‌కు ఆదేశించారు. 2 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేయించారు. వృథాగా ఉన్న ఆర్వో వాటర్ ప్లాంటుకు మరమ్మతులు చేయించి విద్యార్థులకు అందుబాటులో తీసుకొచ్చేలా ఎమ్మెల్యే తగు చర్యలు తీసుకున్నారు.

గురుకులం ఆవరణలో హైమాస్ట్ దీపాల బిగింపు

సింగూరు జలాలు జిల్లా సాగుకు ఇవ్వాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సింగూరు జలాలు జిల్లాసాగుకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. స్థానిక కేవల్ కిషన్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన కొండాపూర్ మండల శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, నర్సింహులు, నాయకులు రాజయ్య, ప్రభాకర్, సత్తయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై దృష్టి సారిస్తాం

గుమ్మడిదల: ప్రజల సమస్యలపై దృష్టి సారిస్తామని గుమ్మడిదల మండల భాజపా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అన్నారంలో ప్రధాని మోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో భాజపా ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, భాస్కర్‌గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సృజనలక్ష్మి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, సీనియర్ నాయకులు రాజిరెడ్డి, ఐలయ్య, శ్యామల, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

షటిల్ పోటీలు.. విద్యార్థుల సత్తా

న్యూస్‌టుడే, నారాయణఖేడ్, జహీరాబాద్ అర్బన్

ఖేడ్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులైన యువకులు ఎక్కడ, ఏ స్థాయి పోటీలు జరిగినా విజయం సాధిస్తున్నారు. ఖేడ్ పట్టణంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు మూడేళ్ల కిందట షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో 80 మంది సభ్యులు చేరారు. స్థానికంగా ఇండోర్ స్టేడియం లేదు. ఖేడ్ పట్టణ శివారులో 25 ఏళ్ల కిందట నిర్మించి ఓ శిథిలావస్థలో ఉన్న ఓ గోదాంకు సభ్యులు అవసరమైన మరమ్మతులు చేసుకుని అందులో సాధన చేస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రంతోపాటు సెలవు రోజుల్లో షటిల్ బ్యాడ్మింటన్ ప్రాక్టీసు చేస్తూ ప్రావీణ్యం పెంపొందించుకొంటున్నారు. షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్లతోపాటు వివిధ సంఘాలు పట్టణ, మండల, జిల్లా, ఉమ్మడి మెదక్ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు ఎక్కడ నిర్వహించినా.. ఇక్కడి వారు పాల్గొంటుంటారు. పోటీ పడితే విజయమే అన్నచందంగా ఎక్కడికి వెళ్లినా.. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల్లో ఏదో ఒకటి పొందడం, లేదా రెండు, మూడు బహుమతులను సాధిస్తుండటం విశేషం.

ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో బహుమతులు పొందిన యువకులు

పోటీ ఎక్కడైనా విజయం వీరిదే: మూడేళ్లలో పలు స్థాయిల్లో 28 సార్లు మండల, 25 సార్లు మండల, 12 సార్లు జిల్లా, 15 సార్లు ఉమ్మడి జిల్లా, 11 సార్లు రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచి బహుమతులను కైవసం చేసుకున్నారు. ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయిలో నిర్వహించిన షటిల్‌పోటీల్లో పలువురు సత్తాచాటి బహుమతులు పొందారు. మరింత మంది సభ్యులుగా చేరడానికి ఆసక్తిని చూపుతున్నా... ఇండోర్ స్టేడియం లేకపోవడంతో చేర్చుకోలేని పరిస్థితి నెలకొంది. స్టేడియం ఏర్పాటు చేస్తే ఈ క్రీడలో మరింత రాణిస్తూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోనూ రాణించగలుగుతామని సభ్యులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

హరీశ్‌రావును కలిసిన భారాస కౌన్సిలర్లు

జిన్నారం: ఆదివారం భారాసకు చెందిన ఐడీఏ బొల్లారం కౌన్సిలర్లు మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మాజీ మంత్రి, భారాస ముఖ్యనేత హరీశ్‌రావును కలిశారు. సమస్యలు, ప్రగతి పనులు వివరించారు. టీరప్ప యాదవ్, సతీష్, సాయికిరణ్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, రత్నం, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి దుర్మరణం

మునిపల్లి: రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఏఎస్సై ఏసయ్య తెలిపిన వివరాలు.. బుదేరాకు చెందిన ఈశ్వరయ్యగౌడ్(65) కల్లు దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం దుకాణానికి వెళుతుండగా.. సదాశివపేట నుంచి జహీరాబాద్ వెళుతున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టింది. గాయపడిన ఈశ్వరయ్యగౌడ్‌ను సంగారెడ్డికి తరలించి చికిత్స అందిస్తుండగా.. మృతిచెందాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

విశాల్

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: పొలంలోని బోరుబావి మోటారు స్విచ్ వేస్తుండగా విద్యుదాఘాతంతో యువ రైతు మృత్యువాతపడ్డాడు. జహీరాబాద్ గ్రామీణ ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాలు.. మండలంలోని శేఖాపూర్‌తండాకు చెందిన పవార్ విశాల్(28) ఆదివారం తండ్రి నర్సింగ్‌తో కలిసి పొలానికి వెళ్లాడు. చెరకు పంటకు నీరు పారించేందుకు బోరు స్టార్టర్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. కేకలు వేస్తూ అక్కడే కుప్పకూలాడు. గుర్తించిన తండ్రి ఇరుగు పొరుగు రైతుల సాయంతో జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా. . మార్గమధ్యలోనే చనిపోయాడు. విశాల్‌కు భార్య, ఆర్నెల్ల పాప ఉంది. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

'ఆదర్శ'లో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

పుల్కల్, న్యూస్‌టుడే: బస్వాపూర్ ఆదర్శ పాఠశాలలో జువాలజీ బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీతోపాటు బీఎడ్ పూర్తిచేసిన వారు అర్హులన్నారు.

ఖేడ్ మండల టీపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

సంఘాలు ఎన్నికలు..

నారాయణఖేడ్: టీపీటీఎఫ్ ఖేడ్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కిష్టయ్య, ఉపాధ్యక్షులుగా రాజుదాస్, పెంటమ్మ, రవీందర్, మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా దీపక్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా సాయిలు, శ్రీనివాస్, సాయిలు, పర్లాల్, సునీత ఎన్నికయ్యారు.

పద్మశాలి సంఘం...

సంగారెడ్డి మున్సిపాలిటీ: పద్మశాలి సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆ సంఘం అఖిల భారత అధ్యక్షుడు బాబూరావు, రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌ల సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా మల్లేశం, వర్కింగ్ అధ్యక్షులుగా రాజు, ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథం, కోశాధికారిగా ప్రభాకర్, స్టీరింగ్ కమిటీ అధ్యక్షునిగా కిశోర్, అసోసియేట్ అధ్యక్షులుగా జనార్దన్, ప్రధాన ఉపాధ్యక్షులుగా రాజు, సత్యం, యువజన అధ్యక్షుడిగా విక్రమాదిత్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలిగా విజయలక్ష్మి, నియోజకవర్గ అధ్యక్షుడిగా వెంకట్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు ఎన్నికయ్యారు.

ఎన్‌పీఆర్‌డీ జిల్లా నూతన కమిటీ...

సంగారెడ్డి మున్సిపాలిటీ: వికలాంగుల హక్కుల జిల్లా కమిటీని సంగారెడ్డిలోఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బస్వరాజ్, ఉపాధ్యక్షులుగా గోపాల్, పోచయ్య, సుభాష్, జయలక్ష్మి, బాలయ్య, శోభమ్మ, కార్యదర్శిగా నర్సింహులు, సహాయ కార్యదర్శులుగా సాయమ్మ, అశ్వక్, లలిత, రాంచందర్, ప్రకాశ్‌రావు, నర్సింహులు, మనోజ్, కోశాధికారిగా ఇస్మాయిల్ ఎన్నికయ్యారు.

జోగిపేట, న్యూస్‌టుడే: జోగిపేటలో జరిగిన వికలాంగుల సంఘం జిల్లాస్థాయి మహాసభల్లో ఆ సంఘం హక్కుల జాతీయ వేదిక సంగారెడ్డి జిల్లా వర్కింగ్ అధ్యక్షుడిగా జోగిపేటకు చెందిన మల్లేశం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మన్నె పోచయ్య, సభాష్‌లు, సహాయకార్యదర్శులుగాసాయమ్మ, రాంచందర్‌లు, సభ్యులుగా రమాదేవి, నాగయ్య, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

బోరు మోటార్ బిగింపు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి మండలం కల్పగూర్‌లో తాగునీటి బోరు మోటార్ కాలి పోయింది. వారం రోజులుగా ఆబోరు పాడయి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 26న' బోరు మోటారుకు మరమ్మతులు కరవు' అనే శీర్షికన కథనం ప్రచురతమైంది. అదే రోజు సంగారెడ్డి ఎంపీడీవో యాదగిరిలు గ్రామానికి వెళ్లి బోరు మోటారును పరిశీలించినట్లుగా 'న్యూస్‌టుడే'కి చెప్పారు. క్షేత్రస్థాయిలో నీటి ఎద్దడిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపినట్లుగా వివరించారు. మోటారును కొనుగోలు చేసి బిగించినట్లుగా ఆయన పేర్కొన్నారు.

రక్షణ జాకెట్ల పంపిణీ

నారాయణఖేడ్: ఖేడ్ పురపాలక సంఘ కార్యాలయంలో ఆదివారం స్వచ్ఛతా హీసేవా కార్యక్రమంలో భాగంగా పురపాలిక పారిశుద్ధ్య కార్మికులకు కమిషనర్ జగ్జీవన్, ఛైర్మన్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్, ఉప ఛైర్మన్ శంకర్ రక్షణ జాకెట్లు, గ్లౌజులు, దుస్తులు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు, మాజీద్, హనుమాండ్లు, పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేయించాలి: ఎస్‌ఎఫ్‌ఐ

సంగారెడ్డి మున్సిపాలిటీ: పటాన్‌చెరులోని గీతం యూనివర్సిటీలో ఇటీవల విద్యార్థిని మృతిపై విచారణ చేయించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మహేశ్ డిమాండ్ చేశారు. స్థానిక ఆ సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్, గర్ల్స్ కన్వీనర్ వాణి, నాయకులు హరీశ్, అర్జున్, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గుమ్మడిదల, న్యూస్‌టుడే: అన్నారం స్టార్ కిడ్స్ పాఠశాలలో ఆదివారం ఇండో అమెరికన్ వైద్య బృంద సభ్యురాలు డాక్టర్ సృజన ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు: సీపీఎం

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సమస్యలపై పోరాటాలు ఉద్ధృతం చేస్తామని సీపీఎం ఏరియా కార్యదర్శి యాదగిరి పేర్కొన్నారు. పార్టీ పట్టణ మహాసభ సందర్భంగా కొత్త బస్టాండ్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, లక్ష్మన్, దుర్గయ్య, మధు, రాజేశ్, మల్లేశం, శివ, దత్తు పాల్గొన్నారు.

చెరువుల శుద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: చెరువులకు పూర్వ వైభవం తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ పురపాలక పరిధి పెద్ద చెరువు పైభాగంలో స్వచ్ఛతాహి సేవా-2024 కార్యక్రమంలో భాగంగా క్లీనప్ డ్రైవ్ అనే సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన చెరువు శుద్ధి కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. వారితో కలిసి వ్యర్థాలు ఏరి చెత్త బుట్టల్లో వేశారు. తదుపరి ఆమె మాట్లాడుతూ.. పెద్ద చెరువును జీవవైవిధ్య ప్రాంతంగా ప్రకటించారని తెలిపారు. దీన్ని పర్యాటక చెరువుగా తీర్చిదిద్దడానికి వ్యాపార సంస్థల సహకారం తీసుకుంటున్నామని చెప్పారు.

ఎట్టకేలకు సీసీ దారి నిర్మాణం

ఈనాడు కథనానికి స్పందన

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: ఎట్టకేలకు అధికారులు స్పందించారు. జోగిపేట వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం బురదగా మారింది. వర్షం కురిసినప్పుడు నీళ్లు వెళ్లే మార్గం లేకపోవడంతో ఆవరణలో బురద పేరుకుపోయింది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో 'ఆసుపత్రి ప్రాంగణం... అధ్వానం!' అనే శీర్షికతో ఈనెల 5న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆసుపత్రి అధికారులు స్పందించారు. ఆసుపత్రి ప్రాంగణం చుట్టూ సీసీ దారిని నిర్మించారు.

18శాతం జీఎస్టీ విధించడం సరికాదు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్‌పై 18 శాతం జీఎస్టీ విధించడంతో వృద్ధులు, సామాన్యులపై పెను భారం పడుతుందని, వెంటనే ఉపసంహరించుకోవాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. పటాన్‌చెరులో ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గించే విధంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పాటుపడాలన్నారు. కిర్బీ ఐఎన్‌టీయూసీ నాయకులు విజయ్‌జాన్సన్, మహేష్‌కుమార్‌గౌడ్, రాజారావు, సుబ్బారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం నిర్వహణ

పటాన్‌చెరు అర్బన్: పటాన్‌చెరు శ్రామికభవన్‌లో ఆదివారం మంజీర విజ్ఞానకేంద్రం, సీఐటీయూల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE VIKARABAD DISTRICT:: AT VIKARABAD
O.S No. 167 OF 2018

Between:
Abdul Ghani ...PLAINTIFF
AND
Abdul Rawoof @ Babu Miyan & others ...DEFENDANTS

NOTICE

To,
11. Tasleem Begum
W/o. Mohd Maqsood, Aged about 41 years, Occ: House wife, R/o. Zaheerabad Taluka, Sanga Reddy District. ...DEFENDANT No.11

Please take notice that the plaintiff herein has filed the suit for Perpetual Injunction before the Hon'ble Senior Civil Judge Court, Vikarabad and the Hon'ble Court was pleased to post the above matter for appearance of the Defendant on 16-10-2024 and the Defendant No.11 is hereby called upon to appear before the Hon'ble Court by person or through counsel by 10:30 AM otherwise the matter will be heard exparte. This is for your information.

// BY ORDER OF THE COURT//
Sd/- MOHD RAFI,
MOHD HASHAM, Advocates,
H.No: 4-1-512-2, Near Cinemax Theatre,
MIG Phase 1 Colony, Vikarabad-501101,
Cell: 9394531766

EENADU Classifieds

BUSINESS SERVICES

JOBS

SAREES

మావద్ద కంచి, ఆరణి, ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట, అన్ని రకముల పట్టు చీరలు & బెనారస్, కలకత్తా, సూరత్ ఫ్యాన్సీ చీరలు హోల్‌సేల్‌గా లభించును. Hyd, మియాపూర్ ఆల్విన్ కాలనీ. ✆ 7396099834.

TENDER

స్క్రాప్ కాంట్రాక్ట్: 100 మె.టన్. అల్యూమినియం డ్రాస్, చిప్స్, పౌడర్, MS, కార్టన్, కంటైనర్లు, తుక్కు. తనిఖీ ప్లాంట్- I, బొల్లారం & ప్లాంట్- II, సదాశివపేట వద్ద. రాణే (మద్రాస్) లి, IDA బొల్లారం, మెదక్ జిల్లా- 502325 వద్ద 1-10-2024 న 2 గం.లకు టెండరు నిర్వహించబడును. వెల్కమ్ ఆక్షనీర్స్, చెన్నై-14. సెల్: 09840731925, www.welcomeauctioneers.com

సంగారెడ్డిలో ప్రముఖ హాస్పిటల్లో పనిచేయడానికి అనుభవంగల ఫార్మసీ అసిస్టెంట్స్ (3), రిసెప్షనిస్ట్ Female (2) మరియు అనుభవం గల ICU సిస్టర్స్ కావలెను. Cell: 9100269997.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. ✆ 91609 00024, 96404 00073.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ॥ 15-40 వేలు. ఫ్రీ రూమ్ + ఫో॥ Hyd. 9182260297.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కరెంటు సమస్యలు.. ప్రజలకు కష్టాలు

న్యూస్‌టుడే, జహీరాబాద్, జిన్నారం, గుమ్మడిదల

జిల్లాలోని వివిధ గ్రామాలు, పట్టణాల్లో సరిపడా విద్యుత్తు సదుపాయాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దశాబ్దాలు గడిచినా ఒక్కటి, రెండు నియంత్రికలతో నెట్టుకొస్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో ఉపకేంద్రాలు సరిపడా ఉన్నా... తరచుగా విద్యుత్తు సమస్యలు నెలకొంటున్నాయి. జహీరాబాద్ పట్టణంలో గృహాలు, వ్యాపారాలు, పరిశ్రమలు, ఇతరాలకు మొత్తం 40 వేల వరకు సర్వీసులు ఉన్నాయి. వీటన్నింటికి ప్రస్తుతం దత్తగిరి కాలనీలోని యాభై ఏళ్లకిందట ఏర్పాటు చేసిన 33/11 కేవీ నియంత్రిక నుంచి కరెంటు సరఫరా చేస్తున్నారు. దీనిపై అదనపు భారం పడి విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోంది. బలమైన గాలులు వీచినప్పుడు తరచుగా సరఫరా నిలుస్తుండటంతో పట్టణవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను తొలగించేందుకు అదనపు ఉప కేంద్రం ఏర్పాటుకు రూ.3 కోట్లు మంజూరు చేసినప్పటికీ స్థలం లేక పనుల్లో ఆలస్యమవుతుంది. రెండు రోజుల కిందట పురపాలిక, రెవెన్యూ, విద్యుత్తు అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించి రామ్‌నగర్, హౌసింగ్ బోర్డు, అల్లీపూర్ ప్రాంతాల్లో స్థలం కేటాయించాలని అభిప్రాయపడ్డారు.

అదనపు స్తంభాలకు విన్నపం

గుమ్మడిదల మండల పరిధిలోని వివిధ నియంత్రికల వద్ద సరైన రక్షణ ఏర్పాట్లు చేయకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

గుమ్మడిదలలో ఆన్‌ఆఫ్ స్విచ్‌లు లేని నియంత్రిక

ఈ సందర్భంగా ఎక్కువగా మూగజీవాలే బలవుతున్నాయి. ఆన్‌ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో అవసరం వచ్చినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా తగు చర్యలు తీసుకుని వాటిని రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిన్నారం మండలం ఖాజీపల్లి శివారులోని 181 జీఎంఆర్ కాలనీలో 15 ఏళ్లకిందట ఉప కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ సుమారు వేయికి పైగా ఇళ్లకు స్తంభాలు వేయలేదు. దీంతో ప్రజలు విద్యుత్తును దూర ప్రాంతం నుంచి తెచ్చుకున్నారు. వర్షాలప్పుడు, గాలులు వీచినప్పుడు వీరికి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అదనపు స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే ఏర్పాటుకు చర్యలు

జహీరాబాద్ పట్టణానికి అదనపు ఉప కేంద్రం మంజూరైంది. అనువైన స్థలానికి అన్వేషిస్తున్నాం. స్థలం లభించగానే ఉన్నతాధికారులకు నివేదికలు పంపి వారి ఆదేశానుసారం తదుపరి నిర్మాణ ప్రక్రియ చేపడతాం. **– లక్ష్మినారాయణ, డీఈఈ, జహీరాబాద్.**

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సదాశివపేట: సదాశివపేట పట్టణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000-2001 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపికలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు.

బదిలీ అధ్యాపకులకు సన్మానం

ఐడీఏ బొల్లారం(జిన్నారం), రాయికోడ్: బోధనలో అధ్యాపకుల కృషిని మరవలేమని ఐడీఏ బొల్లారం పురపాలిక అధ్యక్షురాలు రోజారాణి పేర్కొన్నారు. బదిలీ ప్రిన్సిపల్ శైలజ, బాలకృష్ణతోపాటు 17 మంది ఉపాధ్యాయులను సన్మానించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నూతన ప్రిన్సిపల్ శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శికి వీడ్కోలు...

పాంపాడ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంగయ్యకు మాజీ సర్పంచి జ్ఞానబాయి కాశీనాథ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు ఆదివారం వీడ్కోలు తెలిపారు. నూతన కార్యదర్శి వెంకటేశ్‌ను స్వాగతించి సన్మానించారు.

అధ్యాపక బృందంతో పురపాలిక అధ్యక్షురాలు రోజారాణి తదితరులు

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 9000014771

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 8008001735